స్త్రీవాద కథ

# పెద్దలూ మీరు మారాలి

వట్లమూడి దుర్గాంబ



తమ జీవితాలు సాధారణంగా చప్పగా సాగిపోయేవాళ్ళు పక్కవాళ్ళ జీవితాల్లో పుకార్లు సృష్టించి అదే థ్రిల్‌గా ఫీలవుతుంటారు. ఆ థ్రిల్ వాళ్ళ జీవితాల్లోంచే రావాలంటే కష్టపడి ఏదైనా సాధించాలి. లేదా డబ్బు ఖర్చుపెట్టి ఏవైనా వ్యసనాలకు బానిసవ్వాలి. ఈ రెండు పనులూ చేయలేని వాళ్ళే పుకార్లకి సృష్టికర్తలవుతుంటారు. అలాంటివారికి బాగానే బలవుతున్నారు శ్యాం, విమల!

'టూ ప్లస్ త్రీ ఈజ్ ఈక్వల్‌టూ' ...నువ్వు చెప్పరా బాబీ.''

"మాబాబాయి'' విమల అదిరి పడింది. "ఏయ్! పిచ్చిపిచ్చిగా వుందా! టూ ప్లస్ త్రీ ఈజ్ ....'' ఆమెమాట పూర్తికానివ్వకుండా "మాబాబాయి'' మళ్ళీ అన్నాడువాడు. ఈ సారి బాబీతో పాటు బేబీ కూడా శృతి కలిపింది. విమల కోపంతో చేతిలోని బెత్తం ఎత్తింది. పిల్లలిద్దరూ తుర్రుమంటూ ఆమెకు చెరోపక్కనుండి పారిపోయి - గుమ్మం దగ్గరకి పరిగెత్తారు. అప్పుడు వెనక్కు తిరిగి చూసింది విమల.

బాబీ, బేబీలమధ్యనో యువకుడు! భుజాన ఓ బ్యాగ్ వెలిసిపోయిన బ్లూజీన్స్ పాంట్-ఎర్రగళ్ళ కాటన్‌షర్ట్ - ఎరుపురంగులోకి తిరిగిపోయి ఆకాశంవైపు చూస్తున్నజుట్టు - చూడగానే పెద్ద సదభిప్రాయం కలగదు ఎవరికైనా! విమలకి కూడా కలగలేదు. అయినా ఈ రోజుల్లో మనుషుల రూపం చూసి అభిప్రాయానికి వచ్చేయడానికి వీల్లేదులే - అని కూడా అనుకుంది.

"అక్కా! ఈరోజు ట్యూషన్ లేదు మాబాబాయి వచ్చాడుగా!'' పిల్లలిద్దరూ గోలగోలగా అరుస్తుంటే - లోపలిగదిలోంచి శారద బయటకి వచ్చింది. " ఓ శ్యామ్ ! నువ్వా రారా! ఇన్నాళ్ళకి మామీద దయకలిగిందా - బాబీ, బేబీ, బాబాయిని లోపలికి రానివ్వండమ్మా మరిదిని ఆనందంగా ఆహ్వానిస్తూనే అతను విమలవైపు చూస్తుండటం గమనించి - "మన పక్కింటి అమ్మాయి ప్లస్ బాబీ బేబీలకి ట్యూషన్ టీచర్ కూడా - ఫీజుతీసుకోదనుకో''. అని నవ్వేసి "విమలా మా మరిది శ్యామ్''. ఇద్దరికీ పరిచయం చేసింది.

శ్యామ్ హలో అంటే విమల నమస్తే! అంది.

"ఈరోజు వీళ్ళు నీ పాఠాలు వినరు విమలా' శారద నవ్వుతూ అంది. "నేనూ అదే అనుకుంటున్నా అక్కా . నే వెల్తామరి'' అనేసి బయటకి నడిచింది విమల. శ్యామ్ ఏదో అంటూ పెద్దగా నవ్వుతున్నాడు వెనుక. 'అతనివాయిస్ బావుంది' అనుకుందామె వెళ్తూ!

ఉదయం పదీ ఆ మధ్య ఇంట్లో పని అయిపోయాక తలుపు దగ్గరగా లాగి పక్కింటి గుమ్మందాకా వచ్చి లోపలికి తొంగి చూసింది విమల. ఆ కాలనీ, ఆరుఇళ్ళు ఒక బ్లాక్ చొప్పున ఇళ్ళన్నీ దగ్గిర దగ్గిరగా వుంటాయి.

ముందు రూంలోనే కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు శ్యామ్. అలికిడికి తలెత్తి చూసి "రండ్రండి'' అన్నాడు. ఆమె సంశయంగా అటూ ఇటూ చూస్తూ నిలబడిపోయింది. అతను ఆమె మొహంలోకి ఓ క్షణం చూసి "చూడండీ - ఈ టైంలో అన్నయ్య వదిన ఆఫీస్‌లకి పిల్లలు స్కూల్‌కి వెళ్ళిపోతారని తెలుసుమీకు. నేనొక్కడ్నే వుంటాననీ తెలుసు. అన్ని తెలసి అక్కడిదాకా వచ్చి ఆగిపోవడం మాత్రం ఏం బాగోలేదు. మీరు రావాలనుకున్నారు వచ్చేయాలి. మనం చేయాలనుకున్న పని కరెక్ట్ అని నమ్మినపుడు ఎలాంటి సంశయం లేకుండా చేసెయ్యాలి. అతను చెప్పి మళ్ళీ మామూలుగా తలొంచుకుని రాసుకోసాగాడు.

ఆమె మనసులో చిన్న కదలిక! వెళ్ళి అతని ఎదురు సోఫాలో కూర్చుని ప్రక్కనే వున్న పేపర్ చేతలోకి తీసుకుంది. "పేపర్ చూస్తుండండి, మానాన్నగార్కి లెటర్ రాస్తున్నాను. మధ్యలో ఆపితే మూడ్ పోతుంది.'' ఆమాటన్నాక అయిదునిముషాలకి లెటర్ పూర్తిచేసి ప్రక్కన పెట్టి తలెత్తాడు. ఆమె దీక్షగా పేపర్ చదువుకుంటోంది.

అతనో నిముషం చూసి - "పేపర్ మీ ఇంటికి తీసుకెళ్ళి చదువుకోవచ్చు. నేనేమీ అనుకోను'' అన్నాడు సీరియస్‌గా మొహం పెట్టి. ఆమె ఉలిక్కిపడి తలెత్తింది. అతనన్నమాట అర్థమై నవ్వుతూ "ఇందుకే రాలేదులెండి, మిమ్మల్ని పరిచయం చేసుకుందామనే వచ్చాను'' అంది. వచ్చినప్పుడున్న బెరుకుదనం లేదు ఇప్పుడామెలో.

అతనిదే తెచ్చిపెట్టుకున్న ఫ్రాంక్‌నెస్ లాలేదు. చాలా సహజంగానే మాట్లాడు తున్నాడు. అతనలా నిర్మొహమా టంగా మాటాడటం ఆమె మనసుకేదో తెలియని హాయినిచ్చింది. క్షణాల్లోనే తమచుట్టూ స్నేహపూరితమైన వాతావరణం అలుము కున్నట్టుగా అనిపించింది. స్నేహమూ, స్వేచ్ఛ కవలపిల్లలు! అందుకే ఆమెలో బిడియం ఎగిరిపోయింది.

"వెరిగుడ్ నాపేరు నిన్న వదిన చెప్పిందికదా! బికాం అయిపోయి చార్టెడ్ ఎకౌంటెన్సీ చేస్తున్నాను. అన్నయ్య, వదినలతో ఓ పదిరోజులు సరదాగా గడిపివెల్దామని వచ్చాను.'' అతనుచకచకా చెప్పేశాడు. ఆమెకి వెంటనే తనగురించి ఏం చెప్పుకోవాలో అర్థంకాలేదు. ఒక రకంగా చెప్పాలంటే తల్లి పెళ్ళి చేస్తానంది. ఆ పెళ్ళికోసం ఎదురుచూడటం తప్ప ఇప్పుడతను చేస్తున్న పనేమీ లేదు. అయినా అతను చెప్పాడు కాబట్టి తనూ ఏదో చెప్పాలి తప్పదు అన్నట్టుగా.

"డిగ్రీ అయిపోయింది! నాన్నలేరు నాకు అమ్మ జాబ్ చేస్తుంది. ఇప్పుడేం చేయడం లేదు - ఖాళీయో'' సన్నటి నిరాశ శృతి చేసుకుని వినబడుతోంది ఆమెగొంతు. అతను కొంచెం ఆశ్చర్యపడినట్టుగా చూసి "ఊరికే ఖాళీగా వుంటున్నారా! బోర్‌కదండీ మీకు టైం ఎలాగ డుస్తుంది. మీ హాబీస్ ఏంటి. '' అతను మాటలు పెంచడానికి అడగటంలేదనీ నిజాయితీని నటించడం లేదనీ కూడా అర్థమైంది ఆమెకి.

"పత్రికలు, నవల్స్, సీరియల్స్ బాగా చదువుతాను.'' కొంచెం హుషారుగా చెప్పింది. "ఇంకా'' తనహాబీ పట్ల అతను అసంతృప్తి ఫీలవుతున్నాడని ఆ అడగడం చెబుతోంది "ఇంకా! అప్పుడప్పుడు టైలరింగ్ చేస్తుంటాను. కొత్త డ్రస్‌లు డిజైన్ చేయడమంటే ఇష్టం''. అంటూ నవ్వి "బయట వాళ్ళకి కాదు నాకు మాత్రమే ఇప్పుడు



ేను వేసుకున్నది నేను డిజైన్ చేసిందే." అతని పట్లఆమెకి ఏర్పడిన అభిప్రాయం ఆమెని ఫ్రీగా మాటాడేలా చేస్తోంది.

శ్యామ్ విమలని మెచ్చుకోలుగా చూస్తూ నిజమా! వెరీఫెంటాస్టిక్ ! మా సిస్టర్‌కి ఈ సెస్ పిచ్చి చాలా నేనే మిమ్మల్ని అడుగు దామనుకుంటున్నాను ఎక్కడ తీసుకున్నారని రేమిటండీ మీ చేతిలో ఇంతమంచి ఆర్ట్ ట్టుకుని ఖాళీగానే వుంటున్నానని చెబుతారు' కొంచెం ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ఆ! ఏంఆర్టు. టైలరింగ్ కూడా ఓ ఆర్టేనా" నాసక్తిగా అందామె.

"కాదా! అసలు మీ దృష్టిలో ఆర్టంటే ఏ గీతమో, కవిత్వమో, నృత్యమో మాత్రమే అనే ప్రాయమున్నట్టుంది. సృజనాత్మకత ఉన్నది ప్రతిదీ ఆర్ట్. మీరీ హాబీని బాగా ఇంప్రూవ్ చేసుకుంటే మీకు చేతినిండా పని, బోలేడు ఆదాయం కూడా" అతని మొహంలో ఎగతాళి లాంటిదేమైనా కనబడుతుందేమో నని ఆమె పరీక్షగా చూసింది. అటువంటిదేమీ కనబడలేదు.

అతను చెబుతున్న మాటలపట్ల కొంచెం ఉత్సాహం పెరిగింది. తను సమాధానం చెప్పక ముందే "నేనీమధ్యనో ఇంగ్లీష్ పేపర్లో చదివాను. ఇంట్లో కూర్చుని తమపిల్లలకి డ్రస్ డిజైన్ చేయడంతో మొదలుపెట్టిన ఆడవాళ్లు, ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నారు" అతని మాట తీరు, చెప్పే విధానం, ఆమెలో ఏదో చెయ్యాలి అనే తపనను పుట్టించేవిగా వున్నాయి.

ఇటువంటి వారు చాలామంది వుంటారు. తమనుండి తాము స్ఫూర్తిని పొందలేరు వీరు. ఎప్పుడూ ఏదో మూలనుండి ప్రోత్సాహాన్ని ఆశిస్తు వుంటారు. అదివున్నంత సేపూ ముందుకు సాగి మళ్ళీ వెంటనే ఆగిపోతుంటారు. ఆత్మ విశ్వాసం లోపించడం అందుకు కారణం. శ్యామ్ ఆమెని ఖచ్చితంగా అంచనా వేయగలిగాడు. కానీ శ్యామ్ ఆమెకి ఏ మాత్రం అర్థం కావడంలేదు. అతని గురించి పూర్తిగా తెలిసిన వాళ్ళు కూడా అతనిది చాలా చిత్రమైన మెంటాలిటీ అంటారు. శ్యామ్‌కి మాత్రం అది చాలా సహజంగా అనిపిస్తుంటుంది.

ఏ మాత్రం ఉపేక్షని సహించని తత్వం! తన ఎదురుగా ఏదైనా సమస్య కనబడుతుంటే అది తనదికాని, మరెవరిదైనాకాని తనకి చేతనైన సహాయం చేయకుండా వుండలేదు. ఇపుడు విమల విషయంలో కూడా అతనంత లోతుగా



వెళ్ళడానికి కారణం అదే. అసలు అతనీ ఊరు రావడానికి కూడా ఆ మనస్తత్వమే కారణం.

శ్యామ్ వాళ్ళ పక్కింట్లో కొత్తగా పెళ్ళయి కాపరానికి వచ్చిన ఓ అమ్మాయిని అత్తమామలు కట్నం విషయంలో బాగా హింసిస్తున్నారు. తల్లిద్వారా ఆ విషయాలు విన్న శ్యామ్ చూసి, చూసి, మరిఆగలేక ఆ అమ్మాయి భర్తని పట్టుకుని చడామడా దులిపేశాడు. అతడు ఇరిటేట్ అయిపోయి నా భార్యగురించి మాటాడటానికి నువ్వెవడివిరా అంటూ లాగి చెంప మీద ఒక్కటి కొట్టాడు, శ్యామ్ ఊరుకోలేదు. గొడవ పెద్దదై పోయింది.

కొంచెం అది చల్లారేదాకా కనీసం ఓ పదిరోజులయినా అన్నదగ్గరవుండి రమ్మని బలవంతంగా పంపారు తల్లిదండ్రులు. శ్యామ్ ఎక్కడ వెంటనే వచ్చేస్తాడోనని ఈ విషయాలు తండ్రి, పెద్దకొడుక్కి లెటర్ రాస్తూ, కొన్నాళ్ళు శ్యామ్‌ని అక్కడే వుంచుకోమని రాశారు. ఇక్కడికి వచ్చి ఇతను ఈ ఉద్ధరింపు కార్యక్రమం (వాళ్ళ దృష్టిలో) మొదలుపెట్టాడని తెలిస్తే అటు తల్లిదండ్రులు, ఇటు అన్నవదినలు ఎలా ఫీలవుతారో.

"మీరురేపే ఏదన్నా టైలరింగ్ సెంటర్‌లో చేరండి. టైమ్ వేస్ట్ చేయకండి" ఎల్లుండి మీకు పరీక్ష వుంటుంది. అన్నంత ఆత్రుతగా చెబుతున్నాడతను. "మా అమ్మకి పెద్ద ఇంట్రస్ట్ వుండదు. మగతోడులేనివాళ్లంకదా నేను బయటకి వెళ్ళడమే ఆమెకి ఇష్టముండదు. డిగ్రీనే నా బలవంతంమీద ఒప్పుకుంది" నిరాశగా అందామె.

"అయితే మానేయండి" చిరాకు వినబడు తోంది అతనిమాటల్లో. "మీ అమ్మగారు కష్టపడి కట్నమిచ్చి పెళ్ళి చేస్తారు. ఆ వచ్చేవాడు ఎలాంటి వాడైనా, వాడిమీద ఆధారపడి వాడి అడుగ్గులకి మడుగులొత్తుతూ, జీవితం గడిపేయండి" అంతకు ముందే తమ ఊళ్ళో జరిగిన సంఘటన తాలూకూ ప్రభావం పూర్తిగా పోలేదు శ్యామ్‌లో.

అసలు కట్నం అడిగే అత్తమామల మీదకంటే చదువుకుని వుండి, ఎంతో కట్నం తీసుకుని వచ్చి బేలగా వాళ్ళముందు నోరుమూసుకుని పడివున్న ఆ అమ్మాయిమీదే అతనికి ఎక్కువ కోపం వచ్చింది. ఆకోపం విమలని చూసేసరికి మళ్ళీ బయటకి వచ్చింది.

ఆమె తెల్లబోయి చూసింది. అతను కొద్దికొద్దిగా అర్థమవుతున్నాడు.

"చూడండీ మీరీ డ్రస్ బాగా డిజైన్ చేశారని నేనన్నాను. మీకెంత ఆనందమనిపించింది. రేపొద్దున్న ఇలా వందలు వేలమంది అనొచ్చు. అంతా మీచేతుల్లోనే వుంది. అప్పుడు ఇంకెంత ఆనందంగావుంటుంది. ఒక్కసారి ఆలోచించండి.' 'అతను ఆ రెండుమాటలు చెప్పి వూరుకున్నాడు. ఆమె వూరుకోలేక పోయింది అలోచించకుండా!

తర్వాతరోజు ఆమె సెంటర్‌కి వెల్తుంటే అతను బెస్ట్ విషెస్ చెప్పాడు. ఆ మాత్రం సాధించడానికి ఆమెకి తల్లితో బాగా పోటాడవలసి వచ్చింది. కూతురెంతో హఠాత్తుగా పొంగిన ఈ ఉత్తేజానికి కారణం ఎవరో అడిగి తెలుసుకుని "ఇంకెప్పుడూ ఆ అబ్బాయి ఒక్కడే వుండగా వాళ్ళింటికి వెళ్ళకు' " అని తీవ్రంగా మందలించిందామె.

ఒక విధంగా ఆమెని బయటకి పంపడానికి కూడాఅందుకే ఒప్పుకుందామే. ఉదయం పదింటి నుండి సాయంత్రం అయిదింటి వరకూ తన ఇంట్లో కూతురు, ఆ ఇంట్లో ఆ అబ్బాయి ఒంటరిగా ఉండాల్సిందే! తను వెళ్ళోద్దన్నా విమల ఆగేలా లేదు. అతనీ ఊరునుండి వెళ్ళిపోయే వరకన్నా - విమలని సెంటర్‌కి పంపాలని నిశ్చయించుకుందామె. ఆమె పరిస్థితి అలావుండే ఒక్కరోజులో శ్యామ్-విమలల మధ్య పెరిగిన చనువు చూసి - శ్యామ్ అన్నవదినలు ఆశ్చర్యం తోనూ - అంతకంటే ఎక్కువైన అనుమానం తోనూ చూశారు. కానీ శ్యామ్‌ని అడిగే ధైర్యం చేయలేక పోయారు ఇద్దరూ.

ఎవరు ఏమనుకున్నా శ్యామ్. విమలల స్నేహం మాత్రం పెరుగుతూనే వుంది. ప్రతిరోజు ఓగంటయినా ఇద్దరూ కూర్చుని మాటాడుకునే వారు. కానీ వాళ్ళు మాటాడుకునే మాటల్లో ఏం తప్పొపట్టాలో అర్థమయ్యేది కాదు ఎవరికీ!

అయినా శారదకి, విమల తన మరిదితో ఆ మాత్రం చనువుగావుండటం కూడా అసలు నచ్చడం లేదు. రేపు ఏదయినా అయితే అత్త మామలకి తను సమాధానం చెప్పుకోవలసి వస్తుంది. ఆమె భర్త పరిస్థితీ అలానేవుంది. తమ్ముడితో తను వాదించలేడు. అంత పటిష్టంగా సమాధానం చెప్పగలడు శ్యామ్! అందులో విచిత్రం ఏమీలేదు. నిజాలు నిజాయితీ ముందు ఎలాంటి తర్కం పనిచేయదు. అతని పరిస్థితి మరీ ఇరుకున పడినట్టుగా వుంది. "తమ్ముడ్ని అప్పుడే పంపకు" అని తండ్రినుండి లెటర్స్ - పోనీ ఇక్కడే వుంచుకుందామంటే - ఇక్కడ మరో సమస్య సృష్టిస్తాడేమోననే భయం.

వీళ్ళ పరిస్థితి ఇలావుంటే - "ఆ అబ్బాయిని విమలకి అడుగుదామనుకుంటున్నారా" అని ఆమె తల్లిని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ అడిగే వారి సంఖ్య ఎక్కువై పోయింది. ఆ అడగడంలోనే తనకేదో హెచ్చరిక వున్నట్టుగా గుర్తించేదామె.

ఇక ఆ లైన్లో వాళ్ళయితే తమకుతాము ఓ పునాది అభిప్రాయానికి వచ్చేసి ఎవరి ఊహల్ని వాళ్ల పైకి అల్లుకోవడం మొదలుపెట్టారు. నిజమైన ముగింపు ఎలా వుంటుందో కానీ - వాళ్ళు తమకి తాము ఇచ్చుకునే ముగింపు మాత్రం ఒకే విధంగావుంది. దానికితోడు విమల ఈమధ్య బాగా హుషారుగా, ఆనందంగా, ఆహ్లాదంగా కనబడుతుంది. అందుకు కారణం వాళ్ళు ఊహించేది పచ్చి అబద్ధం - కాని నిజం వాళ్ళు నమ్మరు. అదివాళ్ళకి పక్కా ఫిక్షన్ కథలా వుంటుంది.

తమ జీవితాలు సాధారణంగా - చప్పగా సాగిపోయేవాళ్ళు, ఇలా పక్క వాళ్ళ జీవితాల్లో పుకార్లు సృష్టించి ,అదేథ్రిల్‌గా ఫీలవు తుంటారు. ఆ థ్రిల్ వాళ్ళ జీవితాల్లోంచే రావాలంటే - కష్టపడి ఏదైనా సాధించాలి. లేదా డబ్బుఖర్చుపెట్టి ఏవైనా వ్యసనాలకి బానిసవ్వాలి. ఈరెండు పనులూ చేయలేని వాళ్ళే ఈపుకార్లకి సృష్టికర్తలవు తుంటారు. అటువంటి వారికి బాగానే బలవుతున్నారు శ్యామ్, విమల.

శ్యామ్‌కి ఇవన్నీ పట్టించుకునే ఓపికా, తీరికాలేవు. అతను ఎప్పుడైనా ఎక్కడైనా తనను తాను బిజీగానే వుంచుకుంటాడు. తనకు కావాల్సిన బుక్స్ సేకరించుకోవడం లోనూ చదువుకోవడంలోనూ బిజీగా వున్నాడతను.

విమల తన ఎదురుగా కనబడిన ఆ అరగంట, గంట తప్ప మళ్ళీ అతని ఆలోచనల్లోకి రాదు. విమలకి కూడా అంతే! చిత్రమేమిటంటే వీళ్ళు ఒకరిగురించి ఒకరు ఆలోచించే సమయంకంటే - వీళ్ళిద్దరి గురించి ఎక్కువసేపు ఆలోచించి తమ టైమ్ వేస్ట్ చేసుకునే వాళ్ళు ఎక్కువయ్యారు.

" మా అమ్మ తిడుతోందండీ మీతో

మాటాడుతుండే" ఓరోజు అతనితో నడుస్తూ అంది విమల. వాళ్ళు పొద్దున్నే ఇద్దరూ కలిసి ఇంటినుండి బయలుదేరతారు. ఆమె కొంచెం దూరం నడిచి పాలబూత్ దగ్గిర ఆగిపోయేది. అతడు జాగింగ్ చేస్తూ ముందుకి సాగిపోతాడు.

''మానేయండి పోనీ'' మామూలుగా అన్నాడతను. ఆమెనిరాశగా చూసింది. అతని నుండి తను ఆశించిన సమాధానం అదికాదు. ఆమెమనసు అర్థమైన వాడిలా నవ్వాడతను! "మరేమిటండీ - ఎన్నాళ్ళని మీరు ఆలోచించ వలసిన దాన్ని నేనే అలోచించి ఏదో టెక్స్ట్ బుక్స్‌కి గైడ్స్ తయార చేసిపెట్టినట్లుగామీకు చెబుతుండాలి, చెప్పండి! మీకు మీరుగా ఆలోచించుకుని మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. అతనిమాటల్లోని ఎగతాళికి కొంచెం ఉక్రోషంగా చూసింది.

అయినా అతని పట్ల వున్న గౌరవం మాత్రం పెరుగుతూనే వుంది. నాకు మీ స్నేహం వదలాలని ఏ మాత్రం లేదు. ఎలాగూ మీరు మీ ఊరు వెళ్ళిపోతే ఏం చేయలేం కదా! మీతో రోజూ మాటాడ్డం వలన నేను ఇంత వరకూ పోగొట్టు కున్నది చాలా పొందగలుగు తున్నాను. కానీ - అమ్మ - మీ అన్నయ్య, వదిన - ఊళ్ళో వాళ్ళు నలుగురూ ... ఆమె నసుగుతూ ఆగింది.

అతను రోడ్డుమీద పడివున్న అరటిపండు తొక్కనొకదాన్ని తీసి పక్కకి విసిరేసి - ఆమె మొహంలోకి చూసి - " రేపు నేను వెళ్లి పోతున్నాను. కాబట్టి మీకిక నాసమస్య అంటూ వుండదు. కానీ అతను ఆగాడు. ఆమెకి పాలబూత్ వచ్చేసింది. అక్కడ తమ ఇళ్ళ పక్కవాళ్ళంతా, విమలనీ, శ్యామ్‌నీ - అసలే అప్పుడే నిద్రలేచి వచ్చారేమో - ఇంతింతైన కళ్ళను చేసుకుని చూస్తున్నారు. ఆమెకి ఇబ్బందిగా వుంది పరిస్థితి. అతను చెప్పబోయే విషయం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

"నాసమస్య వుండదుకానీ మీ సమస్య మాత్రం మిమ్మల్ని అంటిపెట్టుకునే వుంటుంది. మరో పదేళ్ళ తర్వాత మనం కలసినా, ఏదో సాధించిన విమల మాత్రం నాకు కనబడేలా లేదు. మీకూ కనబడదు. అందుకు సమాజంలో నలుగురూ ఎప్పుడూ అడ్డువస్తూనే వుంటారు కదా!" అతను ముందుకు సాగిపోయాడు.

ఆమె ఆలోచనలు మాత్రం ముందుకి సాగడం లేదు. " మరో పదేళ్ళ తర్వాత కూడా ఏదో సాధించిన విమల నాకు కనబడదు" అనే అతని మాట దగ్గరే ఆగిపోయాయి.' నేటి మన ఆలోచనలే రేపటి మన జీవితం' అన్నాడు శ్యామ్ తనతో ఒకసారి. దాన్ని బట్టి చూస్తే రే పటి తనజీవితమేమిటో స్పష్టంగా తెలుస్తూనే వుంది. ఆమె తలవిదిల్చి పాల పాకెట్ అందుకుంది.

తర్వాతరోజు ఎనిమిదిన్నర తర్వాత విమల వాళ్ళ లైన్‌లో చిన్న సంచలనం రేగింది. పదింటికి నిద్రలేచే అలవాటున్న వాళ్ళు కూడా విషయంవిని - ఏదో ఇల్లు అంటుకున్నట్టుగా బయటకి పరిగెత్తుకొచ్చారు. అంతా విమల వాళ్ళింటి ముందు చేరారు. విమల తల్లి మొహం కత్తివేటుకి నెత్తురుచుక్క లేనంతగా పాలిపోయింది. ఆమె మొహంలో ఆదుర్దా, భయం, అవమానం అన్నీ కలగా పులగంగా వున్నాయి.

అసలు విషయం - పొద్దున్నే ఆరింటికి పాల పాకెట్‌కి వెళ్ళిన విమల ఇంకా ఇంటికి రాలేదు. పావుగంటలో వచ్చేయాల్సిన పిల్ల రెండున్నర గంటలయినా రాలేదు. కంగారేకదా! కానీ అంత కంటే కంగారుపడవలసిన విషయం - జాగింగ్‌కి వెళ్ళి ఏడున్నరకల్లా వచ్చేసే శ్యామ్ కూడా ఇంటికి రాలేదు.

"మాశ్యామ్ అలాంటివాడు కాదండీ" శ్యామ్ అన్న చెబుతున్నాడు కానీ - గట్టిగా అనడానికి ధైర్యం చాలడం లేదు. ఇటువంటి విషయాల్లో జనం పైకి మగవాడిని తిట్టి లోపల ఆడదాన్ని అంటారు. కాబట్టిప్రస్తుతం అందరికోపం శ్యామ్ అన్నవదినలమీదే వుంది. విమల తల్లికి నోటవెంట మాట రావడం లేదు గానీ - కళ్ళవెంట నీళ్ళు మాత్రం ఆగకుండా కారుతున్నాయి.

"ముందు మీ నాన్నగార్కి ఫోన్ చేసి చెబుదాం! ఒకవేళ అక్కడికే వెళ్ళారేమో!" ఓ మహానుభావుడి సందేహం. " భలేవారండీ మీరు! అతనేం అంత తెలివితక్కువ వాడా! ఏ గుళ్ళోనో పెళ్ళి చేసుకుని తీరిగ్గా తీసుకెళ్తాడు గానీ -" ఆతరువాత నవ్వు ఆపుకుంటూ ఆపేశాడు మరో పెద్దమనిషి.




విమల తల్లికానీ - శ్యామ్ అన్నవాదినలుకానీ - ఏమీ మాటాడ్డంలేదు. ఆ ముగ్గురు తప్ప అందరి నోళ్ళు పని చేస్తున్నాయి. చిత్రమేమిటంటే అంతమందిలో ఎవరికీ అభిప్రాయభేదం లేదు. అందరికదీ ఒకేమాట! భిన్నత్వంలో ఏకత్వమనేది ఇలాంటి విషయాలలో బాగా ఋజువవుతుంది మన సమాజంలో! ఏదన్నా ఒక పుకారు పుడితే దాన్ని ఇంకొంచెం పెంచడానికి ప్రయత్నిస్తారు కానీ - నిజానిజాలు తెలుసుకోవడానికి ఎవరూ ప్రయత్నించరు.

నిజాలు మాత్రవే మాటాడేవారేవెూ వీటిగురించి పట్టించుకోరు. వాళ్ళకి ఇటువంటి వాటికంటే- వాళ్ల టైమ్ విలువయింది కాబట్టి ఒకేరకమైన మనషులు మోస్తుంటారు కాబట్టే వీటిలో నిజాలు బయటకి రావు.

"పోనీ వాళ్ళకంత ఇష్టంగా వుంటే - నాదగ్గరకి వచ్చుంటే - నేను ఇవతల అవతల సర్ధి చెప్పేవాడినికదా" ఓ పెద్దాయన చాలా ఉదారంగా ఓ సంఘసంస్కర్త లెవల్‌లో అంటున్నాడు. ఆయన అప్పుడప్పుడు, కథలూ, కవితలూ కెలుకు తుంటాడు. అందుకే పైకి అలా అంటూనే లోపల - ఈవిషయాన్ని ఎంత పసందైన కథగా మలచవచ్చో ఆలోచిస్తున్నాడు.

ఆ సమావేశం అలా ఇంకా ఎంతసేపుసాగేదో కానీ - ఓ దృశ్యం అక్కడి వారందరి నోళ్లూ మూయించేసింది. శ్యామ్ విమల వస్తున్నారు దూరంగా. విమలచేతిలో పాలపాకెట్! శ్యామ్ చేతిలో కుక్కపిల్ల! బాబీ బేబీలు ఎంతో ప్రేమగా పెంచుకునే కుక్కపిల్ల అది! దూరం నుండే తమ ఇళ్ళముందు గుంపుని గమనించిన ఆ ఇద్దరికీ పరిస్థితి సగం అర్థమైంది. దగ్గరగా వచ్చాక - విమలతల్లి, తన అన్నవదినల మొహాల్లోకి చూశాక పూర్తిగా అర్థమైంది శ్యామ్‌కి, విమలకీ అర్థమైంది కానీ - జీర్ణంచేసుకోవడం చాలా కష్టంగా వుంది ఆమెకి.

సమాజంలో 'నలుగురు' అనే ఆయుధం ఎంత గొప్ప వ్యక్తిత్వాన్నైనా ఎలా చీల్చగలదో ఇప్పుడు స్పష్టంగా అర్థమైంది ఆమెకి. మనసుని కొన్ని విషయాల్లో పాషాణం చేస్తేకానీ - ఆ ఆయుధాన్ని ఎదుర్కోవడం చాలాకష్టం! ఆమె నదురుబెదురు లేకుండా శ్యామ్ వైపు చూసింది. అతనైతే సమాధానం ఇంకా బాగా చెప్పగలడని ఆమె నమ్మకం. ఆ నమ్మకం వృధాకాలేదు కూడా!

శ్యామ్ చిరునవ్వుతో మెల్లగా జారుకుంటున్న పెద్ద మనుషులనుద్దేశించి "ఆగండిసర్, ఒక్కనిమిషం" అన్నాడు అందరూ ఆగారు. అతను

కొనసాగించాడు. " అన్నయ్యా! నేను జాగింగ్‌కి వెల్తుండే మనకుక్క పిల్ల వెంట పడింది. చాలా దూరం వరకూ వెనక్కి తిరిగి చూశాను. కాలువిరిగి బాగా రక్తం కారుతోంది.

విమల నా పక్కనేవుంది. వెటర్నరీ హస్పటల్ ఇక్కడికె దగ్గరలో వుంది తీసికెళ్దాం అంది. సరేఅని ఇద్దరం వెళ్ళాం. అక్కడ డాక్టర్ రావడం లేటవడంతో ఇంతటైంపట్టింది - అంతే!" చాలా సింపుల్‌గావుంది! ఊహకంటే నిజాలు ఎప్పుడూ చప్పగానే వుంటాయికదా! విమల తల్లి, శ్యామ్ అన్నవదినల మొహాల్లో చెప్పలేనంత రిలీఫ్! కొంచెం గర్వంగా కూడా చూశారు అందరివంక.

"నేను చెబుతూనే వున్నానురా మాశ్యామ్ అలాంటివాడుకాదనీ - విమల అమ్మగారితో సహా ఎవరూ నమ్మలేదు." కొంచెం నిష్ఠూరం కలిపి - చాలాకోపంగా వుంది శ్యామ్ అన్నగొంతు.

మిగతావారందరి మొహాల్లో ఏదో నిరుత్సాహం స్పష్టంగా కనబడుతోంది. శ్యామ్‌కి నవ్వొచ్చింది. అతను మాటలు కొనసాగించాడు. " చూడండీ! మీలో అందరూ చదువుకున్నవాళ్ళు - ఉద్యోగాలు చేస్తున్నారు - విజ్ఞులు - పైగా అందరూ దాదాపు మానాన్న గారి వయసున్న వాళ్ళు. అందరూ ఒకే అభిప్రాయానికి ఎలా వచ్చారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి కనబడక పోతే దానికి ఒక్కటే ముగింపా! మరోకారణం వుండదా!

అసలు మా మధ్య ఏం వుందనీ! ఆ అమ్మాయిలో మంచి ఆర్ట్ వుండి కూడా ఏదో డిప్రెషన్‌లో వున్నట్టుగా నాకనిపించింది. నా ఎదురుగా ఎవరూ అలా వుండటం నాకిష్టం వుండదు. అందుకే నాల్గు మంచి మాటలు చెప్పాను. ఆమె కూడా నా నుండి అదే ఆశించింది. ఇంత ప్రాక్టికల్ స్నేహంమాది అంటే మీరు నమ్మరు!

అసలు నేటి యువతరం మీ ఆలోచనలంత కుళ్ళిపోయిలేదు. ఈతరంలో ప్రాక్టికాలిటీ పెరిగింది. ప్రేమలు, త్యాగాలు, ఆత్మహత్యలు లాంటి ఉచ్చులోంచి బయట పడాలని చూస్తోంది. కానీ మీ పెద్దతరం అది సాధ్యపడనీయడం లేదు. మీరే-మళ్ళీమళ్ళీ అవే ప్రేమలు - సెంటిమెంట్లు - కట్నాలు - లంచాలు - ఇవన్నీ - మాపై రుద్దుతున్నారు. సినిమాలు, సాహిత్యం మీనుండి వచ్చేదంతా అదే!" ఎప్పుడూ ప్రశాంతంగా నవ్వుతూ వుండే శ్యామ్ మొహం ఎరుపురంగులోకి తిరిగిపోయింది. అక్కడంతా ఒకలాంటి నిశ్శబ్దం - కాదు - స్థబ్దత ఆవరించింది.

"చూడండిసర్ - మనం ఎలా ఆలోచిస్తే మనముందుతరం అలా వుంటుంది అంటారు. 'వీరేశలింగం' బాల్యవివాహాలు లేని 'సమాజాన్ని ఊహించారు - బలంగా ఆశించారు. మనమిపుడు అందులోవున్నాం! అలాగే మీ ముందు తరం స్త్రీ పురుష సంబంధాలపట్ల చాలా ఇరుకుగా ఆలోచించారు. మీరలావున్నారు. కానీ మేమంత సంకుచితంగా వుండాలను కోవడం లేదు. అందుకు మేం మారితే చాలదు. సమస్యకాదు- సమస్య మూలం నశించాలి. అందుకు మీ మనసులు మారాలి - దయచేసి మమ్మల్ని ఉన్నతంగా వూహించండి - మా తర్వాతి తరమైనా బాగుపడుతుంది" అతను గబగబాలోపలకి వెళ్ళిపోయాడు.

దట్టంగా పరుచుకున్న ఆనిశ్శబ్దం తెర సర్రున చిరిగినట్టు ఆగుంపులోవున్న ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళు శ్యామ్ వెనుక చప్పట్లు కొట్టడం మొదలుపెట్టారు.

